29072024-MAI-04_Layout 1 7/29/2024 3:53 AM Page 1

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

బహుముఖ సాహితీ శిఖరం సినారె

'వాక్కు నా దైవం శబ్దం నా దైవం'. ఒక టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో ఆచార్య సి.నారాయణ రెడ్డిని 'మీరు ఆస్తికులా?' అని అడిగిన ప్రశ్నకు వారు ఇచ్చిన సమాధానం ఇది!

నిజమే! సి.నారాయణ రెడ్డి వాక్కును, శబ్దాన్ని ఎంతగానో ఆరాధించారు కాబట్టి వారి కవితా రచనల్లో, మాటల్లో వాక్కూ శబ్దం నవరసమయంగా భాసిస్తూ సాక్షాత్కరించింది. సాహిత్య రంగంలో వారికి పద్మశ్రీ, పద్మభూషణ్, జ్ఞానపీఠ్ వంటి పురస్కారాలను ఎన్నింటినో వరించేలా చేసింది ఆ వాక్, శబ్ద సరస్వతి!



నాటి ఉమ్మడి కరీంనగర్ (నేటి రాజన్న సిరిసిల్ల) జిల్లాలోని వేములవాడకు సమీపంలో హనుమాజీపేటలో 1931 జూలై 29 నాడు ఏ సాహిత్య గంధమూ లేని రైతు కుటుంబంలో బుచ్చమ్మ, మల్లారెడ్డి దంపతులకు సి.నారాయణ రెడ్డి ఏకైక పుత్రుడిగా జన్మించారు. వేములవాడలో హరికథలు వింటూ, పల్లెలోని జానపదులతో సన్నిహితంగా ఉంటూ, పల్లెవాగు తరగలలోని లయను అవగాహన చేసుకుంటూ, చందోనియమాలు తెలియకున్నా చిన్ననాటి నుంచి నారాయణరెడ్డి పద్యాలు, గేయాలు అల్లడం మొదలుపెట్టారు.

విద్యార్థిగా ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నారు. ఆ విధంగానే వారి విద్యాప్రస్థానం సిరిసిల్ల నుంచి కరీంనగర్, హైదరాబాద్ దాకా సాగింది. బీఏ కూడా ఉర్దూ మాధ్యమంలోనే చదువుకున్న సినారె తెలుగు భాషా సాహిత్యాలను ఎక్కువగా, మక్కువగా అధ్యయనం చేశారు. ఆ రోజుల్లో 'సింహాద్రి' అనే కలం పేరుతో రచనలు చేశారు. దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి, బిరుదురాజు రామరాజులతో కలిసి తెలంగాణ రచయితల సంఘం స్థాపనలో పాలుపంచుకున్నారు. బిరుదురాజు రామరాజుతో కలిసి జంటగా 'రామ నారాయణ' పేరిట కవిత్వాన్ని చెప్పారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు పూర్తిచేసి సికింద్రాబాద్ కళాశాలలో లెక్చరర్‌గా చేరి తన అధ్యాపక జీవనాన్ని ప్రారంభించారు. 'ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయము ప్రయోగాలు' అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. అది ఇప్పటికీ విద్యార్థులకు పరిశోధకులకు విశిష్ట ఆచూకీ గ్రంథంగా ఉపయోగపడుతున్నది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలోనే పనిచేస్తూ లెక్చరర్ నుంచి రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. ఆ తర్వాత అధికార భాషా సంఘం అధ్యక్షులుగానూ, ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గానూ, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గానూ తన విశిష్ట సేవలను అందించారు. భాషా సాంస్కృతిక సలహాదారులుగా పనిచేశారు. రాజ్యసభ మెంబర్‌గా నియమితులై ఆ పదవికే వన్నె తెచ్చారు.

ఆచార్య నారాయణ రెడ్డి కవిగా, సినీ కవిగా, ఆచార్యుడిగా, వక్తగా, తెలుగు గజల్ వాగ్గేయకారుడిగా, పరిపాలనాధికారిగా తన ప్రత్యేకతను, దక్షతను ప్రదర్శించిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

డాక్టర్ సి.నారాయణరెడ్డి తన 60 ఏండ్ల సాహితీ ప్రస్థానంలో మొత్తం 80 పైచిలుకు రచనలను ప్రచురించి ప్రకటించారు. వీరి తొలిగ్రంథం 'నవ్వని పువ్వు'. ఇది గేయనాటికల సంపుటి. 1953లో వచ్చింది. అక్కడి నుంచి 'జలపాతం' (ఇందులో త్రివేణి సంగమం లాగా పద్య, గేయ, వచన కవితలు ఉన్నాయి). 'అజంతా సుందరి', 'వెన్నెలవాడ', 'రామప్ప' వంటి గేయనాటిక సంపుటులు 'రుతుచక్రం' (ఋతువులపై కావ్యం), 'నాగార్జున సాగరం', 'విశ్వనాథ నాయకుడు', 'కర్పూర వసంతరాయలు' వంటి గేయ కథా కావ్యాలూ, 'మంటలూ మానవుడు', 'మనిషి చిలక', 'ముఖాముఖి', 'మధ్యతరగతి మందహాసం', ఉదయం నా హృదయం', 'మార్పు నా తీర్పు', 'తేజస్సు నా తపస్సు' వంటి వచన కవితా సంపుటులు, 'విశ్వగీతి', 'మృత్యువు నుంచి', 'భూమిక', 'మథనం', 'విశ్వంభర' (ఇది సినారెకు జ్ఞానపీఠ అవార్డును తెచ్చిపెట్టింది), 'మట్టి మనిషి', 'ఆకాశం' వంటి వచన కవితా దీర్ఘకావ్యాలూ, 'మీరాబాయి', 'ముత్యాల కోకిల' వంటి అనువాద రచనలూ, యాత్ర రచనలూ, విమర్శనా వ్యాస సంకలనాలు ఆయన రచనా సంపదలో ఉన్నాయి.

తెలుగు భాషతో పాటు ఉర్దూభాషలో సైతం మంచి ప్రావీణ్యం ఉన్న సినారె ఉర్దూలో కూడా కవిత్వం రాశారంటారు. ఉర్దూ సాహిత్య సంప్రదాయంలోని గజల్ ప్రక్రియను కవి డాక్టర్ దాశరథి పరిచయం చేయగా సినారె 'పరుల కోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని' అంటూ గజళ్లు విస్తృతంగా రాసి, తానే గానం చేసి తెలుగు గజల్ వాగ్గేయకారుడయ్యారు.

'నా అనుభూతిలో బ్రతుకునంత ఇమిడ్చిన కావ్యగీతిలో/ మాయగ లేని మంజు మధుమాస విలాస సుహాస రేఖికా/ ఛాయలు నిలిచిపోయినను చాలు జవాబుల గ్రీష్మమందు నా/ గేయము లాలపించి ఉలికించెద చల్లని తేనె వానలన్' (జలపాతం సంపుటి) అంటూ మధుర మంజుల మంజులంగా పద్యాలు రాయగలిగి ఉండి కూడా 'ఈ వసంతాలలో నీ చూపు పిలిచెనా/ ఈ వసంతాలలో నీ రూపు మొలిచెనా' (తేనె పాటలు) అంటూ ఇష్టంగా తేనెపాటలు రాసినా.. 'సాగుమా ఓ నీల మేఘమా! గగనవీణ మృదుల రాగమా!' అంటూ ఎంతో ఇష్టంగా గేయాలు రేడియో కోసం రాసిన సినారె, తర్వాత మారిన కాలాన్ని అనుసరించి వచన కవితలు రాశారు. ఇటు వచన కవితలు రాస్తూ, అటు సినిమా కోసం మాత్రాఛందస్సులో పాటలు రాస్తూ సవ్యసాచిగా పేరు గడించారు.

వక్తగా సినారె: అత్యద్భుతంగా తీయని గొంతుతో పబ్లిక్ మీటింగుల్లో ప్రసంగించే సినారె దాదాపు ప్రతిరోజూ చిక్కడపల్లి సిటీ సెంటర్ లైబ్రరీలోను, త్యాగరాజ గానసభ మీటింగ్ హాల్లోనూ జరిగే సాహిత్య సభలకు అధ్యక్షుడిగాను, ముఖ్య అతిథిగానూ హాజరై సముచిత ఉపన్యాసం చేసి ప్రేక్షక శ్రోతలను ఆకట్టుకునేవారు.

భారతీయ తెలుగు సాహిత్యకారుడిగా సినారె విదేశాల్లో పర్యటించి ప్రసంగించారు. విలువగల సినారె కవిత్వం ఇంగ్లీషులోకి మన దేశ భాషల్లోకి అనువాదమైంది.

ఉదయం తన హృదయంగా, ఇంటిపేరు చైతన్యంగా, తేజస్సు తన తపస్సుగా ప్రకటించిన సినారె 'ఈ తపస్సు కొనసాగనీ/ ఘనస్వామ్యం విరిగే దాకా/ పణవిపణి లాంటి లోకంలో ప్రగతి మూల్యం ఎదిగేదాకా' 'తేజస్సు నా తపస్సు' అంటాడు. 'పదునెక్కిన పది గోళ్ల మధ్య/ బిగిసిన రెండు పిడికిళ్ల మధ్య/ నెత్తురు కక్కిన పెత్తనం/ అరచి అరచి చచ్చిన దొరతనం' (తేజస్సు నా తపస్సు – భరత వాక్యం కవిత) అంటూ దొరతనంపై తిరుగుబాటును నాలుగు పంక్తుల్లో చెప్తాడు.

'గతమనెడు వజ్రంపు గోడల కట్టడంపై నిట్ట నిలువున/ శిరసు నెత్తిన స్వర్గమయ గో/పురము సుమీ వర్తమానం' (సమదర్శనం) అంటూ చెప్పిన సినారె–'రాజనీతిలో నీతి విరిగితే రక్షణ ఏదీ సమాజానికి/ నడిపే రక్తం కుళ్లిపోతే మనుగడ ఉంటుందా శరీరానికి' (కలం సాక్షిగా) అని వాపోతాడు. సప్తవర్ణాలను ఏక కిరణంగా చేసి ప్రకాశించే సహస్ర కిరణుడు సూర్యునితో కవిని పోల్చడం సరైనదేనంటూ.. 'పరిమళాల నెవడాపును? పైరగాలి నెవడాపును? ఎవడాపును మానవతా రవిరుక్కును? కవివాక్కును?' అని ప్రశ్నిస్తూ.. ఎవడూ ఆపలేడని ధ్వనిగర్భితంగా సమాధానం చెప్తాడు. 'కలిమికి సాఫల్యం నలుగురికీ దక్కినప్పుడే/ పదవికి సాఫల్యం అది ప్రజల మనసుకి ఎక్కినప్పుడే' (ప్రపంచ పదులు) అని తన కవిత్వం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా మానవతావాదాన్ని ప్రబోధించిన కవి ఆచార్య డాక్టర్ సి.నారాయణ రెడ్డి.

రఘువర్మ
92900 93933

(ఆచార్య సినారె 93వ జయంతి సందర్భంగా...)

తెలియనివి తెలిసినపుడు...

చాలా విషయాలు నాకు
తెలియనివి తెలిసిన క్షణాన
భయంతో కూడిన
విభ్రాంతి కలుగుతుంది
అరికాళ్లకు ముల్లు గుచ్చుకుంటే
కళ్లకు కన్నీళ్లెందుకో అర్థం కాదు
కారణం
కాళ్ళూ కళ్ళూ ఒకే శరీరం యొక్క
అనుసంధిత (Intergal)
అవయవాలు కావడమేనా
అంటే ఒక మనిషి యొక్క నొప్పిని
మరో మనిషి అనుభూతించి
పంచుకోవాలంటే
వాళ్లు ఒకే శరీర భాగాల్లా
అనుసంధానం కావాలి కదా–
నొప్పి, బాధ, దుఃఖం
అందరూ పంచుకుంటూ
సుఖ సంతోషాలను కూడా
సమపర్చుకుంటూ
'పంచుకోవడం' అనే విస్తృత సూత్రం
ప్రపంచవ్యాప్తమై పరిఢవిల్లితే
మనిషి మాధవుడౌతాడా–మనిషి ఒకే
కుటుంబమై, గణజనమై.. జనరాజ్యమై
పరిణామ నియమం.. ఎంత సరళతరమో
గాలిలో ఊపిరి.. గాలిలో మనం..
మనతో 'అందరి' గాలి
కన్నీళ్ళు కన్నీళ్ళను ఆకర్షించి
ద్రవింపజేయడం.. ఒక పాఠమే కదా

కన్నీళ్లకు ఉనికి ఉంటుందా
చెట్టు కొమ్మను ఎంత చెక్కినా
పుట్టబోయే చిగుళ్ల ఆనవాళ్లు కనిపిస్తాయా
అనుభవాలు ముద్రలు ముద్రలుగా
వెలిసి గోడల మీది ఎండిపోయిన
పాన్ మరకల వలె
పిడికెడు గుండెలపై పాఠాలుగా
మిగిలి శాసిస్తున్నపుడు
మనిషి సుత్తె దెబ్బలు తినీ తినీ మిగిలిన
సొట్టలు పడ్డ రాతెండి గిన్నె ఐ
కిందపడి భళ్ళున శబ్దించి
జరజరా జరజరా బురదలోకి పరుగు
లోయల్లోనో, ఎడారి ఇసుకలోనో,
మురికి కూపంలోనో
కూరుకుపోవడం Blockade..
System derailed
మనిషికి దిక్కుతోచకో,
దిక్కులేకో బిక్కుబిక్కున
ఒక వినిర్మాణ ఆంతరిక
శిథిలతలో శిలౌతున్న స్థితి
ఒక Let-Out కావాలె..
నిశ్వసించుటకు

అరే... ఒక్క క్షణం నిలబడి
అమాయకపు పశువుల కళ్ళలోకి చూడు
కుక్క ప్రేమమయ చూపుల్లోకి చూడు..
ఒట్టి శుద్ధ అమాయకత్వం
పిచ్చుకల కిచకిచలను వింటూ
అడవి చెట్లలోకి అదృశ్యించు
వీటన్నింటిలో గుప్తమై ఉన్న 'ప్రాణం'
ఎక్కడుందో తెలియదు
కానీ వాటిలోనే ఎక్కడో
చెట్లలోనే ఉన్నట్టు తెలుస్తుంది–
అప్పుడు మొస పోసుకుంటూ
పరుగెత్తుకుని పరుగెత్తుకుని
రైల్వే ప్లాట్‌ఫాంపైకి ఉరికొస్తావు
ఒంటి నిండా దుఃఖంతో
నువ్వు వీడ్కోలు చెప్పవలసిన రైలు
వెళ్లిపోతూ కనిపిస్తుంది దూరంగా
నువ్వపుడు కొంత కరుణవై.. కొంత
కాంతివై.. కొన్ని వర్షపు చినుకులవై
ఒట్టి స్థాణువువై నిలబడిపోతావు
లోపల ఒక ఇసుక తుఫాన్
గర్జిస్తూ భీకరంగా–

ఏది చీకటి.. ఏది వెలుతురు–
ఏది ఉన్నది.. ఏది లేనిది
ఓ మహర్షీ.. ఓ మహాత్మా–

రామా చంద్రమౌళి
93901 09993

29 భాషలు, 100 మంది కవులు...

అద్భుత కవిత్వం

సృజన ఏ ఒక్కరి సొంతం కాదు. పైపైగా భిన్న భాషలు, భిన్న సంస్కృతులు. ఒక భాషలో ప్రతిభావంతులైన వారి సాహిత్య సృజనను ఎంతోమందికి చేర్చాలంటే 'అనువాదం' అనేది ఎంతో అవశ్యం. ఎక్కడి డోగ్రి, ఎక్కడి కొంకణి, పక్కన మలయాళీ, మరాఠీ పొరుగున నేపాలీ నుంచి సింహళి వరకు భోజ్‌పురి నుంచి సంబల్ పురీ ఇలా ఎన్నో భాషల్లో ఇంకిన కవితా మధురిమలు ఇక్కడి తెలుగు వారికి అందడం గొప్ప అవకాశం. వారంతా ఆ వివిధ భాషల కవిత్వాన్ని తమ చేతులతో అందుకుని ఆపాదమస్తకం తిరగేసి, చదివేసి బాధను, సంతోషాన్ని ఆశ్రువులుగా మార్చుకున్న పాఠకులు అనేకం. అందులో నేనొకదాన్ని. వివిధ భాషల కవిత్వం చదవడమంటే కేవలం కవిత్వమే కాదు అక్కడి సంస్కృతినీ చదవడం, అర్థం చేసుకోవడమే.

'నాకు కవిత్వం కేవలం కవిత్వం కాదు
సగం శబ్దం సగం నిశ్శబ్దం
శబ్దమేమో బతుకు ఏడుపులోంచి
ఎగిసి పడుతున్న ఎక్కిళ్లు
నిశ్శబ్దమేమో బతుకు చేతగానితనం
లోంచి వ్యక్తమవుతున్న 'మౌనం'
అంతే కాదు
కవిత్వ సంక్షోభం కాల ప్రవాహంలో
నన్ను ఒడ్డుకు చేర్చే తెరచాప
బతుకు సమరంలో నిలబట్టే లంగరు'

అని తన అంతరంగాన్ని ఆవిష్కరించే వారాల ఆనంద్ అనువాదం పట్ల కూడా అంతే నిబద్ధతతో ఉన్నారు. స్వయంగా కవిత్వం రాస్తే రాసిన వ్యక్తి భావం బాణిని మనం తెలుసుకోగలం. కానీ అనువాదం వలన విభిన్న ప్రాంతాల, భాషల ఆలోచనలను ఒడిసి పట్టుకోగలం. అందులో ఓలలాడగలం.

ప్రపంచ సాహిత్యాన్ని ఆసాంతం చదివేయాలని ఆకాంక్ష ఉన్న పాఠకులకు ఆనంద్ లాంటి అనుసృజనకారుల పుట్టుక ఒక వరమే. ద్విభాషా సూత్రం, త్రిభాష సూత్రం అమలు అంటూ ప్రభుత్వాలు ఎన్నిచేసినా మూడు భాషలకు మించి ఎక్కువ మందికి తెలిసే అవకాశం లేదు. మాతృ భాష కాకుండా ఇంకా ఎక్కువ మందికి తెలిసిన మిగతా భాషల్లో కూడా సాహిత్యాన్ని ఆస్వాదించేంత భాషపై పట్టు ఉండదనే చెప్పొచ్చు. మరి అలాంటి అన్యభాషల సాహిత్యంలోని మాధుర్యం పొందాలంటే ఆనంద్ లాంటి వారి అవసరం ఈ సాహితీ ప్రపంచానికి ఎంతో ఉన్నది.

భారత రాజ్యాంగం ఆమోదించిన 22 భాషలే కాకుండా మొత్తం 29 భాషల నుంచి దాదాపు 100 మంది కవుల కవిత్వాన్ని అనువదించి సెంచరీ కొట్టారు ఆనంద్. కవుల్నే కాకుండా కవితలను లెక్కిస్తే 150కి పైగా వారి



'ఇరుగు పొరుగు' సంకలనంలో జతచేరాయి. ఆనంద్ 'ఇరుగు పొరుగు' సాహిత్య సామ్రాజ్యాన్ని విస్తరించే పనిలోనే ఉన్నారు. త్వరలోనే 'ఇరుగు పొరుగు' 2వ సంకలనం కూడా రాబోతుందట. గుల్జార్ రాసిన 'ఎ పోయెమ్ ఎ డే' అనేది తనకు గొప్ప ప్రేరణ అంటున్న ఆనంద్ కొత్తతరం అనువాదకులకు మార్గదర్శి అనడంలో సందేహమే లేదు. ఇప్పటికే గుల్జార్ గ్రీన్ పోయెమ్స్‌ను ఆకుపచ్చ కవితల పేరున తెలుగులోకి అనువదించారు ఆనంద్. ఆ సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డునిచ్చి సత్కరించింది.

ఎంత ఇష్టం ఉన్నా చదివి పూర్తిగా అర్థం చేసుకోలేని భాషను పరాయి బాషగానే చూస్తాం. కానీ, ఆనంద్ పుణ్యామని గుల్జార్ గ్రీన్ పోయెమ్స్(ఆనంద్ ఆకుపచ్చ కవితలు)తో తెలుగువాళ్ల సాహితీ లోగిళ్ల పుస్తకాల అలమారాలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. యువతను చదివించే విధంగా ఉన్న రూపికౌర్ ఆంగ్లంలో తన చిన్న చిన్న కవితలతో ఇన్‌స్టా పోయట్‌గా ప్రపంచవ్యాప్తంగా పేరు గడించారు. అంతే కాదు, ఆమె యువతతో సాహిత్యం చదివించడంలో విజయం సాధించారు. ఇలాంటి కవితలను అనువదించడం ద్వారా ఆనంద్ కూడా తెలుగు యువతరానికి చేరువయ్యారు.

'అతన్ని ఎట్లా ప్రేమించాలో
నేర్చుకుంటున్నాను
నన్ను నేను ప్రేమించుకుంటూ' అంటారు.

అంతే కదా! ఇద్దరు ఒకటే అయినపుడు అంతకుమించి ఇంకేముంది. అదే ప్రేమకు పరాకాష్ట. పొట్టి పొట్టి వాక్యాల్లో ఇంతటి గట్టి భావాన్ని అందించి అనువాదానికి అందం తెచ్చారు.

అశోక్ వాజపేయి హిందీ మూల కవిత మరణం గురించి...

'చిన్న పిల్లాడిని
ఉదయపు నడకకు
చేతి వేలు పట్టుకుని తీసుకెళ్ళినట్టు
తనతో తీసుకెళ్ళిపోతుంది'

అంటూ చాలా సున్నితంగా సుతిమెత్తగా మనం వెళ్లిపోవాల్సిందే అనే చేదు నిజాన్ని తేట తెలుగులో తీయంగా మార్చారు. ఈ సందర్భంలో భయపడటం ఎప్పుడు మానేస్తామో అప్పుడే మన జీవితం మొదలైనట్టు అని చేగువేరా వాక్యాలు గుర్తొస్తాయి. ఇక అరిజిత్ రావు ఆంగ్ల కవిత 'పగిలిన హృదయాలు' భిన్నమైనవైనా ఒకేలా ఉంటాయి.

'బహుశా అందుకేనేమో
కన్నీళ్లకు ఏ రంగు ఉండదు.
అవునవును కన్నీళ్లకు మూలాలుంటాయి'

రంగు రుచి వాసన ఉండదంటూనే తెలుగు వర్ణం అద్దారు. 'వీడ్కోలు' అనే బద్రీనాథ్ హిందీ కవితలో..

'వీడ్కోలు'లో నిర్ణయించడం ఒకింత కష్టమే
ఎవరు ఎవరికి వీడ్కోలు చెప్తున్నారో
ఇద్దరు ఆకర్షణీయమైనవారే
ఇద్దరు ఆధునికులే
కానీ ఒకటే అంశం
సాంప్రదాయకమైంది
అదేమిటంటే
ఇద్దరు ఏడుస్తున్నారు' అన్నారు.

ఎవరు ఎవరికి చెప్పినా వీడ్కోలు విచారకరమే! వీడ్కోలులో ఉన్న బాధ లోతును చక్కని పద ప్రయోగంతో కళ్లకు కట్టినట్టు అనువదించి రాసి కన్నీళ్లు తెప్పించారు ఆనంద్. గొప్ప కవిత్వాన్ని అనుసృజన ద్వారా అమ్మ భాషలోకి కూర్చి అమ్మ రుణం తీర్చుకున్నారాయన.

ఇంతమంది కవుల మదితలుపు తట్టి వారి భావనల్లోకి తొంగిచూసి పాఠకులకు అత్యంత సులభంగా సాహితీ ప్రపంచాన్ని సందర్శించే అవకాశాన్ని అందించిన ఆనంద్‌కు అభినందనలు.

కల్వకుంట్ల శ్రీలత రావు
94914 80386

బతుకు బొంతలు

అందరు ఒక్కతీరుగ
కింది నుంచి మీదికి జూసి.
గింత పెద్ద హాస్టల్లో
బొంత తెచ్చుకున్న మనిశెవ్వడని
నవ్వుతున్నప్పుడు
నా నాలుగు గుండె కుండలల్ల
గాడి పొయ్యి ముట్టిచ్చినట్టు
రక్తం భగభగమని మసులుతుంటది
ఎదుకంటే
పక్క పిన్నీసులన్నీ
తాళిబొట్టుకు ఏలాడితే
కాసుల పేరేసుకున్న
మా లచ్చిమి లెక్కనే కానత్తది మా అవ్వ.
ఖాన్‌సాబ్ ఇచ్చిన తాయిత్తులైతే
అక్కడక్కడ సుట్టుకపోయి
ఆ కాసుల పేరుకు ముత్యమోలే మెరిసిపోతయి.
ఇంకా చేతులకేసుకునే గాజులు
పోచమ్మ గుడి ముంగట
క్యూ లైన్‌లో నిల్సున్న మనుషుల లెక్క
తీరొక్కటై ఉంటది.
మణి మకుటాలే లేవు గని
మధ్య తరగతి మహారాణి మా అవ్వ.
ఈలపీట పట్టుకున్న అవ్వను జూస్తే
పేదరికం మీద తిరగవడ్డ ఐలమ్మ లెక్క గానొస్తది.
అందుకనే గా ధైర్యం నాలోపల ఉండాలని
సాయిమాన్ల దాసుకున్న అవ్వ పాత చీరలన్ని
బొంతమెరంగ కుట్టించుకున్న.
ఇండ్ల ఒక్కొక్క చీర ఒక్కొక్క పండుగ నాటిది
మరి గీ బొంత మీద పండుకుంటే
పండుక్కి ఇంటికిపోవాలనే బుగులు పోతది కదా
అట్లనే సిన్నప్పుడు జ్వరం వస్తే
నెత్తి మీదికెల్లి నీళ్లు దింపి
మూడు బజాట్ల గుడ్డు
పారేసిన రోజులు యాదికొచ్చి
జరం కూడా ఎగిరిపోతది కదా
అందుకే గీ హాస్టల్కి వచ్చినప్పుడు
వొయిలంత భద్రంగ
అప్పటి చీరల బొంత కూడా
ఎంబటి తెచ్చుకున్న
జ్ఞాపకాలన్నీ నా గుండె గూట్లనే దాసుకున్న.

సందీప్ వొటారికారి
93902 80093

మాండలికానికి జీవం పోసిన పెండెం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే బాల సాహిత్యంలో ఇంటి భాషకు పట్టం కట్టి, తెలంగాణ మాండలిక పదాలతో బాలల కోసం అనేక కథలు రాసిన వారిలో పెండెం జగదీశ్వర్ ఒకరు. దశాబ్ద కాలం పాటు ఇంటి భాషలో కథలు రాస్తూ నూతన ఒరవడి సృష్టించారు. ఆయన పిల్లల మనసును గెలిచిన బాల సాహితీవేత్త. జగదీశ్వర్ వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ప్రవృత్తి రీత్యా కార్టూనిస్టుగా, బాలల రచయితగా పనిచేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక కార్యశాలల్లో పాల్గొని ఎన్నో సృజనాత్మక రచనలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట సమీపంలోని కొమ్మాయిగూడెం లోని చేనేత కుటుంబంలో జన్మించిన పెండెం జగదీశ్వర్ గ్రామీణ జీవితాన్ని ఔపోసన పట్టి కనిపించిన ప్రతి విషయాన్ని వస్తువుగా మలిచి కథలు సృష్టించాడు. చూసిన లేదా విన్న ప్రతి అంశాన్ని సుదీర్ఘంగా మిత్రులతో చర్చించేవాడు. పెండెం జగదీశ్వర్ కథకుడు మాత్రమే కాదు, నిత్య బాలుడు కూడా. వివిధ సందర్భాల్లోనూ పిల్లలు మాట్లాడుకునే ఇంటి భాషలో చర్చిస్తూ ఉండేవాడు. స్వచ్ఛమైన తెలంగాణ మాండలిక పదాలతో పిల్లల కథలు రాయడంలో గెలిచి నిలిచిన వాడు. కానీ, జీవితంలో స్వల్పకాలంలోనే ఓడిపోయిన విజేత మన జగదీశ్వర్.

తొలిరోజుల్లో తెలంగాణ భాషలో ఎంతోమంది రచయితలు పిల్లల కథలు రాశారు. అయినప్పటికీ నేటి తరంలో ప్రతిభావంతంగా జీవ భాషలో పిల్లల స్థాయికి అనుగుణంగా అనేక కథలు రాసి ఒక విలక్షణ శైలి సృష్టించారు పెండెం జగదీశ్వర్. మనకు తెలిసిన మన కథలను తెలంగాణ భాషలో చెప్పడంలో జగదీష్ చేయి తిరిగిన రచయిత. 1994 నుంచి బాల సాహిత్యంలో రచనలు చేస్తున్న ఇతను ఆంధ్రప్రదేశ్ జానపద కథలు దగ్గరి నుంచి ఆనంద వృక్షం, గజ్జెల దయ్యం, పసిడి మొగ్గలు, విడ్డూరాల బుడ్డోడు, నూట పదహారు నవ్వులు, తాను తీసిన గోతిలో, ముగ్గురు అవివేకులు, మాతో పెట్టుకోకు వంటి వివిధ పుస్తకాలు రాశారు. వైజ్ఞానిక దృక్పథంతో కూడా అనేక కథలు రాశారు. ఏ కథ చదివినా ముచ్చట పెడుతున్నట్టే అనిపిస్తది. పెండెం జగదీశ్వర్ కళాజాత బృందాల కోసం, నాటి వయోజన విద్యా ప్రచారం కోసం జన విజ్ఞాన వేదిక సభ్యునిగా హేతుబద్ధ దృక్పథంతో చిన్న చిన్న కథలు రాశారు. గజ్జెల దయ్యం పుస్తకంలో ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలు, భయాలపై లోతుగా ఆలోచింపజేశాడు. ఈ పుస్తకానికే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు బాల సాహిత్య పురస్కారం అందించారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినంక జగదీశ్వర్ రాసిన బడి పిల్ల గాళ్ల కథలు ఇంటి భాషకు గొప్పగా పట్టం కట్టాయి. అదేవిధంగా విడ్డూరాల బుడ్డోడు కథలు కూడా బాగా ఆకర్షిస్తాయి. సరదాగా అనిపించే ఈ కథలు ఎదుగుతున్న బాల్యాన్ని పరిచయం చేస్తాయి. కష్టం, శ్రమ, గ్రామీణ జీవన సౌందర్యంలోని అంతరార్థం, పరమార్థం బాగా తెలిసినవాడు. అందుకే ప్రతి కథలో వాటిని ప్రతిబింబింపచేశాడు. జగదీశ్వర్ రాసిన అనేక కథల్లో అద్భుతమైన హాస్యాన్ని పండించారు. తెలంగాణ ఇంటి భాష మళ్లీ ఒక కొత్త వెలుగు కోసం ఆత్మగౌరవ దిశగా పయనిస్తున్న సమయంలో పెండెం రాసిన కథలు కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించాయి. తెలంగాణ యవనిక మీద బలమైన వాగ్దానాల సంతకాలు చేసిన అతడు అర్ధంతరంగా కనుమరుగైపోవడం అత్యంత విషాదకరం. వేల మంది విద్యార్థులకు, అనేకమంది మిత్రులకు ఆదర్శంగా నిలిచిన పెండెం సేవలు నిజంగా చిరస్మరణీయం. అందుకే ఆయన మరణానంతరం కూడా అతని ఆత్మీయులు, స్నేహితులు ఆయన రాసిన బాల సాహిత్యాన్ని బతికించేవిధంగా పెండెం జగదీశ్వర్ స్మారక బాలసాహిత్య పురస్కారం నెలకొల్పి ఏటా ప్రదానం చేస్తున్నారు. 2024కు గాను ప్రముఖ బాలసాహితీవేత్త సిద్దిపేటకు చెందిన గరిపెల్లి అశోక్ ఇటీవల పెండెం జాతీయ బాల సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు.

కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
9441561655

సంపాదన

నువ్వేం సంపాదించావ్ నాన్నా?
అని, మేమెప్పుడూ అడగలేదు

మేము మిమ్మల్నే సంపాదించాం పిల్లలూ
అని, అమ్మానాన్నలెప్పుడూ చెప్పలేదు

సంపాదనెప్పుడూ
మా సంభాషణలోకొచ్చేది కాదు

ఉన్నప్పటి సంతోషాన్ని
లేనప్పటి దుఃఖాన్ని
తలాయింత పంచుకోవటమే
మాకు తెలిసేది!

చిత్తలూరి
91338 32246

జీవనది



తాటిపెల్లి తిరుపతి
8498939258

గంగతల్లి తన భుజాలకి
ఉయ్యాల కట్టుకుంది

బిడ్డలకి నీటిచుక్క అంటకుండా
ఒడ్డుకి చేర్చేతందుకు

గరళ కంఠుడిలా
మనిషి చేసిన మలినాన్ని నింపుకుంటుంది

మనస్సులో నింపుకున్న బాధల్ని
తనను జేరి పలకరిస్తే వొంపుకుంటుంది
ఆకలి బాధలు తెలిసింది కాబోలు
నమ్ముకున్న బిడ్డల కడుపు నింపుతుంది

మేఘాలను వేడుకుంటుంది
రేప